

# కన్నెపిల్ల-కమనీయ స్వప్నం

పి. లక్ష్మి

ప్రియమైన అక్కయ్యకు :


నీకెప్పటినుంచో ఒక విషయం చెప్పాలని అనుకొంటున్నాను. నీవు వస్తావని ఎదురు చూసినా రాలేదు. ఇక లాభం లేదని తెగించి వ్రాస్తున్నాను. మరి నీ 'రిప్లై' నాకు త్వరగా రాస్తావు కదూ?–

అబ్బా....భయం వేస్తోంది. ఎలా వ్రాయను? నేను పనిచేస్తున్న 'మెడికల్ డిస్ట్రిబ్యూటింగ్ కంపెనీ'కి చాలామంది రిప్రజెంటేటివ్స్ వస్తుంటారు. వాళ్ళు చక్కని 'పర్సనాలిటీ'లతో నీట్‌గా మెరిసిపోతుంటారు. అందులో కొందరు కామ్‌గా ఉంటారు. కొంతమంది చలాకీగా తమ మాటలతో, చేష్టలతో అందరినీ ఆకట్టుకోవడానికి ప్రయత్నిస్తారు. అలా సునీల్‌కుమార్ అనే అతనితో నాకు పరిచయమయింది. సుమారు 30 లోపల వయస్సుతో, ఎంతో అందంగా, ఎదుటి వారిని ఆకర్షించేలా కనిపిస్తారు ఆయన. అన్నిటికన్నా, అందరితోను క్రొత్త, పాత లేకుండా మాట్లాడుతారు. ఆంధ్రప్రాంతానికి వచ్చిన తరువాతనే తెలుగు నేర్చుకున్నారట. అయినా ఫరవాలేదు. తప్పులు వస్తున్నా ఉత్సాహంగా మాట్లాడటానికి ప్రయత్నిస్తారు.

ఆయనతో నా మొదటి పరిచయం ఆఫీస్‌లో అయింది. ఆ రోజు ఆఫీస్‌లో ఆ సమయంలో ఎవరూ లేనందున నా చేతిలోని హిందీ పుస్తకం చూసి, 'అరే మీకు హిందీ వచ్చా?' అని అడిగారు. 'ఏదో కొంచెం మాట్లాడగలను' అని అన్నాను. అలా మాట్లాడుతూ నా మౌనాన్ని చూసి ఆయన 'నేనింత ఎక్కువగా మాట్లాడుతున్నా మీరు ఎక్కువగా మాట్లాడటం లేదే? నేను మిమ్మల్ని బోర్ చేస్తున్నానేమో?' అన్నారు. కంగారుగా 'అబ్బే అదేం లేదండి. మీరు కొత్తగదా, అందుకే అంతగా మాట్లాడలేకపోతున్నాను' అన్నాను. 'నేను మీకు కొత్త అనిపించినా నాకు మాత్రం మీరు క్రొత్త అనిపించడంలేదు. అయినా నేను ఇక్కడికి వస్తున్నప్పుడల్లా నన్ను మీరు చూస్తూనే వున్నారుగా? ఇంకా కొత్త ఏమిటి?' అన్నారు. ఇంతలో ఓ టైపిస్టు రావడంతో 'బై' చెప్పి అతనితో మాట్లాడి వెళ్ళిపోయారు. ఆయన చొరవకు నాకు ఆశ్చర్యమేసింది.

VIN...

★ నిమ్మకాయ కావలసివచ్చి, ముక్కలుగా తరుగుతాం. మనకు ఒక్క ముక్కే కావాలి. తక్కినవి అలా వదిలేస్తే పాడవుతాయి. ఏం చెయ్యాలి? ఆ తక్కిన ముక్కల్ని ఉప్పు జాడీలో పడేయండి – మూడు నాలుగు రోజులవరకూ పాడవకుండా అలాగే వుంటాయి.



ఒకరోజు ఆఫీస్‌లో లేటయినందున బస్ కోసం వెయిట్ చేస్తుండగా స్కూటరు ఒకటి ముందు నుండి వెళ్ళింది. 'లాల్ ఖడీ, మైదాన్ ఖడీ' అన్న పాట పరిచయమయిన గొంతు నుండి వినిపించే సరికి ఎవరా అని తల యెత్తాను. అంతలో స్కూటర్ నా ప్రక్కగా నిలిచింది. ఎదురుగా నవ్వు మొఖంతో సునీల్. నేనెంత ఎర్ర చీర కట్టుకుంటే మాత్రం అలా పాడటమేమిటి అని కొంచెం కోపం వచ్చింది. అంతలో సునీల్ 'ఏమిటి మేడమ్, బస్ గురించి వెయిట్ చేస్తున్నారా?' అని అన్నారు. అవునని తల ఊపాను. 'ఇఫ్ యూ డోంట్ మైండ్ ఐ విల్ డ్రాప్ యూ' అన్న ఆయనతో 'నో థేంక్స్, యూ కెన్ గో ప్లీస్,' అన్నాను కాస్త సీరియస్‌గా. 'అరె మేడమ్! నేనేమన్నానని అంత కోపం?' అన్నారు. 'మీరేం అనలేదుగాని, దయచేసి యిక్కడి నుండి వెళ్ళిపొండి' అంటూ చేతులు జోడించాను. అది చూసి చిలిపిగా నవ్వుతూ 'వెళ్ళకపోతే?' అంటూ నా ముఖంలోకి చూశారు. నాకు చిరాకెత్తి 'మీరు వెళ్ళకపోతే నేనే యిక్కడి నుండి వెళ్ళిపోతా' నంటూ విసురుగా నడక సాగించాను, వెధవ బస్సు రానందుకు మనస్సులో తిట్టుకుంటూ. 'ఏమండోయ్, కొంచెం ఆగండి' అని స్కూటర్ స్టార్ట్‌చేసి ముందుకు తెచ్చి నిలిపిన సునీల్, 'ఒక చిన్న మాట విని వెళ్ళండి' అన్నారు. 'ఏమిటా మాట' అన్నట్లు చూశాను. 'నాతో మీరు ఐస్ పార్లర్‌కి రావాలి,' అని, 'ఎందుకు?' అన్న నన్ను చూసి గట్టిగా నవ్వుతూ 'ఎంత పిచ్చివారండి ఐస్‌పార్లర్‌కి ఎందుకు వెళతారు? చల్లని పానీయం త్రాగటానికి. అదీకాక మీరు ఈ రోజు చాలా వేడిగా ఉన్నారు. చల్లబడటానికి తప్పక కూల్ డ్రింక్ తీసుకోవాలి' అన్నారు. ఆయన చిలిపితనానికి చిరునవ్వు నవ్వుకొని మెల్లిగా 'ఇప్పుడు కాదు, మరొకసారి వస్తాను. ప్రస్తుతం నేనింటికి త్వరగా వెళ్ళాలి.' అంటున్న నాతో, 'తప్పకుండా వస్తారు కదా!' అంటున్నంతలో బస్ వచ్చింది. నేను బస్ ఎక్కడంతో 'టా! టా!' చెప్పి వెళ్ళిపోయారు.

ఆయనతో అలా రెండు, మూడుసార్లు మాట్లాడటం జరిగింది. ఆయన మాట్లాడినపుడల్లా కళ్ళలో ఏదో వెలుగు కన్పించేది.

ఆ రోజు ఆఫీస్‌లో పని త్వరగా అయిపోవడంతో ఫాన్సీ షాప్‌లో పని ఉండి సెంటర్ వైపుకి నడక సాగించాను. "హలో రేఖా!" అన్న పిలుపు వినిపించేసరికి ఉలిక్కిపడి రోడ్డు దాటుతున్న నేను ఆ వైపుకు తిరిగాను. అంతలో ఎదురుగా కారు రావడంతో కంగారుగా ఎటు తప్పుకోవాలో తెలియక యిక నా పని అయిపోయిందనుకొని కళ్లు మూసుకొన్నాను. అనుకోకుండా క్షణంలో ఎవరో మెరుపులా లాగటం, వారితోబాటు నేను కొంత దూరంలో విసురుగా పడటం జరిగింది. నా చేతిలో ఉన్న హేండ్‌బాగ్, నవల దూరంగా పడిపోయాయి. అసలే నా పరిస్థితి నీకు తెలుసుగా? మరుక్షణం స్పృహ కోల్పోయానలాగే. అలా ఎంతసేపు అయిందో తెలియదు. చల్లనీళ్ళతో తడిపిన కర్చీఫ్‌తో ముఖాన్ని తుడుస్తుంటే మెల్లగా కళ్ళు విప్పాను. 'ఎలా వుంది రేఖా' ఆత్రుతగా ముఖంలోనికి వంగి చూస్తున్నారు సునీల్. చుట్టూ జనం కన్పించారు. దాంతో తెలివి వచ్చిన నేను రోడ్‌లో–అందులో ఆయన ఒడిలో సిగ్గనిపించి లేవబోయాను. 'హుష్ మెల్లగా!' అని చేయి ఆసరా యిచ్చి లేవదీశారు. రోడ్‌లో అలా జరిగినందుకు సిగ్గుతో నా తల బరువుగా వాలిపోయింది. అందరూ ఎలా ఉందని ప్రశ్నించారు. ఫర్వాలేదంటూ సమాధానపర్చి యిబ్బందిగా ముఖం పెట్టాను.

నా ముఖాన్ని చూసి పరిస్థితిని అర్థం చేసుకొన్న సునీల్ టాక్సీని పిలిచి, డోర్ తెరిచి 'రా రేఖా' అని పిలిచారు. ఇంకా అక్కడ కొంత మంది జనం నిలబడి ఉన్నారు. ఇక మారు మాట్లాడకుండా ఎక్కి కూచున్నాను. 'ఇదిగో మీ హేండ్‌బాగ్, నవల,' అంటూ అందిస్తూ ప్రక్కన కూచున్నారు. 'ఏం రేఖా, ఎలా వుంది? దెబ్బలేమయినా తగిలాయా?' అన్న ఆయనతో 'ఏం లేదు' అన్నాను. 'ఊహుఁ! మీరు నిజం చెప్పడంలేదు. ఏం లేదన్నప్పుడు ఈ సిగ్గూ, మౌనం ఎందుకూ? మీరు చెప్పకపోయినా నాకు తెలుసు' అని ఓ క్షణం ముఖంలోనికి చూశారు. ఏమిటన్నట్లు ప్రశ్నార్థకంగా పెట్టాను ముఖాన్ని. 'అలా రోడ్‌లో పడిపోయానే – అని కదూ' అని అన్నారు నా భావాలు చదివినట్లు. 'ఊఁహుఁ! ఏం కాదు' తల ఎత్తకుండానే అన్నాను. 'నో! కొంచెం ఇటు చూసి చెప్పండి' వంగి కళ్ళలోనికి చూస్తూ అన్నారు.

ఎందుకో ఆ కళ్లలోనికి చూసిన తరువాత అబద్ధం చెప్పాలని అన్పించలేదు. పైగా కారణం కూడా అదేగా? ఔనంటూ తల ఊపాను. 'ఈ మాత్రం దానికే యిలా బాధపడితే ఎలా? మరీ ఇంత సెన్సిటివ్‌గా ఉండకూడదు. నాకు నచ్చదు' అన్నారు. మధ్యలో తనకు నచ్చటమెందుకో నాకర్థంకాక ఒళ్ళు మండింది. అంతలో టాక్సీ హోటల్ 'ప్రీతమ్' ముందు ఆగింది; తాను దిగి డోర్ పట్టుకొని దిగమన్నట్లు చూశారు. డ్రైవర్ దిగి కొంత దూరంలో నిలుచున్నాడు. 'ఇక్కడికెందుకు తీసుకువచ్చారు?' అన్నా వినిపించుకోకుండా డ్రైవరుకు డబ్బిచ్చి పంపడంలో మునిగిపోయారు. నాకసలే కోపంగా ఉందేమో మౌనంగా తనను అనుసరించాను ఫేమిలీరూంలోకి. మౌనంగా కూర్చున్న నాతో 'ఏం తీసుకుంటారు రేఖా!' అని అడిగారు. 'నాకేం అక్కర్లేదు. అసలిక్కడకు ఎందుకు తీసుకొచ్చారో చెప్పండి' అన్నాను కోపంగా. 'అరే ఆ రోజు మీరు నాకు మాట ఇచ్చారుగా! మర్చిపోయారా? కొంచెం గుర్తుచేసుకోండి.' అన్నారు. 'నేను మీకెప్పుడూ ఏ మాటా యివ్వలేదు,' అని దబాయించాను. 'మీరు నిజంగా నాకెప్పుడూ మాటివ్వలేదూ? ఇలా నా కళ్ళలోకి చూసి చెప్పండి. అలా అయితే ఇప్పుడే వెళ్ళిపోదాం.' కొంచెం గంభీరంగా వచ్చిన ఆయన మాటలకు మౌనంగా తల వంచుకొన్నాను. 'త్వరగా చెప్పండి. మీ మాట అబద్ధం కానప్పుడు భయం ఎందుకు?' మెల్లగా కళ్ళెత్తి చూశాను. ఎదురుగా ఆయన కళ్ళు 'ఏం మాటివ్వలేదా' అని

సూటిగా ప్రశ్నిస్తున్నాయి. 'ఔను. మాటిచ్చాను' అంటూ మెల్లగా నవ్వాను. అంతవరకు నేనేమి చెపుతానో అన్న ధ్యాసలో వున్న ఆయన ఒక్కసారిగా 'మరి ముందెందుకలా అన్నావు?' అన్నారు. 'ఊరికే, తమాషా చేయడానికి' అని జవాబిచ్చాను. 'అబ్బా! నిజంగా మీ ఆడవాళ్ళని అర్థం చేసుకోవటం చాలా కష్టం సుమా' అన్నారు ఆయన నవ్వుతూ. బేరర్ రావడంతో 'ఐస్‌క్రీమ్' తెప్పించి నాకో కప్పు అందించి, తనొకటి తీసుకొన్నారు.

'ఎప్పటినుండో మీకో విషయం చెప్పాలని అనుకుంటున్నాను. నాకోసం పది నిమిషాలు కూర్చుంటారా? ప్లీజ్' అని అర్థింపుగా అడుగుతుంటే కాదనలేక అదిరే గుండెను చిక్కబట్టుకొని భయంతో కూచున్నాను. "రేఖా! నేను మిమ్మల్ని మనసారా ప్రేమిస్తున్నాను. నన్ను తప్పుగా అర్థంచేసుకోవద్దు. ఎన్నాళ్ళగానో యీ విషయంపై మీ అభిప్రాయం కనుక్కోవాలని అనుకొంటూనే, భయంతో ఆలస్యం చేశాను. ఏం రేఖా! జవాబు చెప్పకుండా మౌనంగా కూర్చున్నావ్? ఇష్టంలేదా? 'ప్లెయిన్'గా నీ అభిప్రాయం తెలుపుతావని అనుకొంటున్నాను." ఆయన మాటలు వింటున్న నాలో ఓ క్షణం చలనం ఆగిపోయింది. ఆయన నన్ను ప్రేమిస్తున్నానని చెప్తుంటే నాకు ఎందుకో చెప్పలేని ఆనందం, ఆశ్చర్యం కలిగాయి. తాను అన్నింటిలో నాకంటె మిన్న. తనంతట తానుగా వచ్చి నన్ను కోరుతుంటే ఎందుకో నాకంటె అదృష్టవంతు లెవరని అనిపించింది. కాని నేనెన్నడూ ఊహించలేదేమో భయంవేసింది. ఇది కలో నిజమో, నమ్మాలో, మానాలో తెలియక బొమ్మలా కూర్చున్న నేను, 'ఏం రేఖా మాట్లాడవ్?' అనటంతో ఒక్కసారి ఉలిక్కి పడ్డాను. ఎదురుగా ఎంతో ఆత్రుతగా నిరీక్షిస్తున్న కళ్ళతో సునీల్ కనబడటంతోటే, గొంతు సవరించుకొని 'అందులో మీ పెద్దవాళ్ళ అభిప్రాయం కూడా తెలుసుకోవాలి కదా?' అన్నాను. అందుకు సునీల్, 'మన పెద్ద వాళ్ళ సంగతి తరువాత చూసుకోవచ్చు. ముందు నీ అభిప్రాయం నాకు కావాలి!' అన్నారు. 'ఏమని చెప్పాలి?' కొంటెగా ప్రశ్నించాను. 'నన్ను ప్రేమిస్తున్నానని' అన్న ఆయనతో 'అబ్బా, నేను చెప్పలేను. సిగ్గేస్తుంది' అన్నాను. ఇందులో సిగ్గుపడటానికి ఏముంది? నీ నోటినుండి విందామని....చెప్పవా?' అని బ్రతిమాలుతూ అడుగుతుంటే మెల్లగా తలెత్తి 'నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను.' చెప్పలేక చెపుతూ సిగ్గు ముంచుకురాగా ముఖానికి చేతులడ్డం పెట్టుకొని తలవంచుకొన్నాను.

సునీల్ నాదగ్గరకొచ్చి నా చేతులను సున్నితంగా తొలిగించి, చుబుకం ఎత్తిపట్టి కళ్ళలోనికి చూస్తూ 'మరొక్కసారి చెప్పవా? రేఖా, నేను ఎంత అదృష్ట వంతుణ్ణి.' అన్నారు. ఆ ఆనందంలో నోటమాట రాక పరవశత్వంతో ఆయన విశాలమయిన ఎదపై వాలిపోయాను. ఆ ఆనందం ఎక్కడా, ఎప్పుడూ పొందలేదు. అదేదో క్రొత్త అనుభూతి. ఆ సమయంలో మనసంతా గాలిలో తేలిపోసాగింది. ఆయన పెదవులేదో అస్పష్టంగా అంటున్నాయి. ఆయన నన్ను దగ్గరగా తీసుకుని....

మీ అందరి అభిప్రాయాలు నేను కనుక్కొని ఉంటే ఆయన 'టూర్' నుంచి రాగానే మీతో మాట్లాడతారు. మరి ఆయన మీకు నచ్చుతారో, లేదో? మరి నాకుమాత్రం నచ్చారు. ఆయనకు నేను నచ్చడం చాలా ఆశ్చర్యంగా ఉంది. నాలో ఆయనను ఆకర్షించిన దేమిటో నా కర్థంకాదు. ఆ మాటే ఆయనతో అంటే 'ఇక ముందెప్పుడూ అలా మాట్లాడవద్దు. నీ మంచి మనస్సే నన్ను ఆకర్షించింది. అదే ఈనాడు మనిద్దరినీ కలిపింది' అన్నారు. 'నిజంగా ఆయనకు ఇల్లాలిని కాగలిగితే ఎంత అదృష్టవంతురాలినో' అనిపిస్తుంది. ఆయన ప్రస్తుతం రెండు నెలలు 'టూర్' లో ఉంటారు. తనకు తల్లీ, చెల్లీ ఉన్నారట. వివాహానికి వాళ్ళేమీ అభ్యంతర పెట్టరట. మన పరిస్థితులు కొంతవరకు చెప్పాననుకో. అన్నీ సర్దుకొనేలా చేస్తామన్నారు. అయినా మనసులనేవి కలిసిన తరువాత ఇవేవీ అడ్డురావని నా ఉద్దేశం. నీదికూడ అలాంటి భావమేనని నా భావన. నీ జవాబు చూచుకొని అమ్మవాళ్ళకి చెపుతాను. కాని సునీల్ లేకపోతే నేను బ్రతకలేనేమో అనిపిస్తుంది. బహుశా ప్రేమంటే ఇదేనేమో! నీ అంగీకారం తెలుపుతూ ఉత్తరం వ్రాస్తావని ఎదురు చూస్తుంటాను.

అక్కా! ఇదంతా నీవు నిజమనుకొంటున్నావా? కాదు. ఊరికే వ్రాశాను. నీయీ చెల్లి అంత అదృష్టవంతురాలా అక్కా? కట్నపిశాచం స్వైర విహారం చేస్తున్న యీ కాలంలో ప్రతి కన్నెపిల్లా భవిష్యత్తు గురించి ఊహించే ఒక మధురస్వప్నం— అంతే! కాని ఎవరి స్వప్నాలెలా సఫలమవుతాయో సృష్టించిన ఆ దైవానికి తప్ప మనకు తెలియదుకదా!


ఇట్లు
నీ చెల్లెలు
రేఖ



★ కర్పూరం ఎంత డబ్బాలో వేసి మూత పెట్టినా, కొంతకాలానికి కొంతయినా హరిస్తుంది. నాలుగు మిరియపు గింజలు, నాలుగు బియ్యపు గింజలూ ఆ డబ్బాలో కర్పూరంతో పాటు వేసి వుంచితే, కర్పూరం అంత తొందరగా హరించుకుపోదు!

★ అర్జెంటుగా మీకు మజ్జిగ కావలసి వచ్చిం దనుకోండి. దానికేం చేస్తారంటే — పాలు గోరు వెచ్చగా వెచ్చబెట్టి అందులో చిటికెడు ఉప్పు వెయ్యండి. కొద్దిగా నిమ్మ పండు రసం కూడా పిండండి. కొద్ది సేపట్లోనే పాలు విరిగి 'మజ్జిగ' అవుతుంది!





★ ఉప్మా చేసుకునే రవ్వకు ఎక్కువగా పురుగు పడుతూ వుంటుంది. అలా పట్టకుండా వుండాలంటే చిన్న గమ్మత్తు వుంది. ఆ రవ్వను కొద్దిగా వేయించి, తీసేసి-తర్వాత నిలవ చెయ్యండి. పురుగు పట్టదు.

[ఈ పేజీలలోని చిట్కాలు పంపినవారు: ఎన్. భువనేశ్వరమ్మ]